ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
***
నల్లగొండ
5
మంగళవారం 29 అక్టోబరు 2024

నల్లగొండ కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి





కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి

2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి
ములుగు కలెక్టర్‌గా సమర్థవంతమైన పనితీరు

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఇలా త్రిపాఠి సోమవారం రాత్రి 11.20కి బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే టూరిజం శాఖలో రిలీవ్ అయిన ఆమె రాత్రి 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆర్డీవో అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతీలాల్, తహసీల్దార్ శ్రీనివాస్ ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు నూతన కలెక్టర్ ఇలా త్రిపాఠికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యత స్వీకరించడం సంతోషంగా ఉందని, అందరి సహకారం, సమన్వయంతో జిల్లాను ప్రగతి పథంలో ముందుంచేందుకు కృషి చేస్తానని ఆమె చెప్పారు.

● ప్రస్తుతం టూరిజం శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇలా త్రిపాఠి స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నో నగరం. 2017లో ఐఏఎస్ సాధించిన ఆమె ఆ ఏడాది యూపీఎస్సీలో 51వ ర్యాంక్ సాధించారు. 2017 నుంచి జూన్ నుంచి 2019 వరకు అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొం దారు. జూలై 2019 నుంచి అక్టోబరు 2019 వరకు భారత ఆర్థికశాఖలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం తెలంగాణ కేడర్‌కు వచ్చాక నవంబరు 2019 నుంచి సెప్టెంబరు 2021 వరకు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత అక్టోబరు 2021 నుంచి జూన్ 2024 వరకు ములుగు కలెక్టర్‌గా సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు సాధించారు. ఆమెభర్త భవేశ్ మిశ్రా కూడా ఐఏఎస్ అధికారి. తెలంగాణ ఐటీ శాఖ కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారు. ఇలా త్రిపాఠి మంచి రచయితగానూ పేరుగాంచారు. ఐఏఎస్, సివిల్స్‌కు ప్రిపేరయ్యే విద్యార్థులనుద్దేశించి ఆమె రచించిన '71 టూ 51' పుస్తకం జనాదరణ పొందింది.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి బదిలీ



నల్లగొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీ.నారాయణరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. 16 జూన్ 2024 నుంచి ఇప్పటివరకు నాలుగు నెలల 12రోజుల పాటు నారాయణరెడ్డి కలెక్టర్‌గా పనిచేశారు. స్వల్ప కాలమే అయినా ఆయన తనదైన పనితీరు ప్రదర్శించారు. ప్రధానంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖను గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

వైటీపీఎస్ నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం

సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణం పనులు తుది దశకు చేరాయి. ఇప్పటికే రెండు యూనిట్లలో ట్రయల్ రన్ నిర్వహించారు. పవర్ స్టేషన్ నిర్మాణంకోసం 2015లో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ప్రభుత్వం పెద్దఎత్తున భూసేకరణ చేసింది. 4,676 ఎకరాల ప్రైవేట్, ప్రభుత్వ భూమిని ప్రాజెక్టుకోసం కేటాయించారు. మోదుగుకుంట తండా, కపూర్ తండాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు నిర్వాసితులుకావడంతో పునరావసం కల్పించారు. ఈక్రమంలో నివాసాలు, వ్యవసాయ భూములు కోల్పోయిన వారికి పవర్‌స్టేషన్‌లో ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జనవరి 2025 నాటికి నిర్మాణం పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేపడతామని ప్రకటనలు వస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల ఉద్యోగ కల్పనపై శుక్రవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- మిర్యాలగూడ

ఆంధ్రజ్యోతి: యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ నిర్వాసితులకు ఉద్యోగాల కల్పనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

సబ్ కలెక్టర్: ప్లాంట్ నిర్మాణంలో భాగంగా నిర్వాసితులైన కుటుంబాల వారికి ఇంటికి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నది ప్రభుత్వం నిర్ణయం. ముందుగా నివాసాలు కోల్పోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు అర్జీలు తీసుకుంటున్నాం. కుటుంబంలో అర్హులైన వారు ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే ఉద్యోగం ఎవరికి ఇవ్వాలనే దానిపై కుటుంబ యజమానితో సంప్రదించి అంగీకార పత్రాన్ని తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎంతమంది ఎంపిక జరిగింది ?

సబ్ కలెక్టర్: నైపుణ్యాలను బట్టి ఉద్యోగ కల్పన చేస్తాం. ఇప్పటివరకు 133 కుటుంబాల్లో అర్హులను ఎంపిక చేస్తాం. ఇళ్ల కోల్పోయిన వారి కుటుంబాల ఉద్యోగుల ఎంపిక పూర్తయితే భూములు కోల్పోయిన కుటుంబాల వారిని ఎంపిక చేసే ప్రకియ కొనసాగుతుంది.

ఆంధ్రజ్యోతి: పోడు రైతుల పట్టాల సమస్య పరిష్కారం మాటేమిటి?

సబ్ కలెక్టర్: డివిజన్‌లో పలు మండలాల్లో పోడు రైతుల పట్టాల సమస్య నెలకొంది. గతంలో రెవెన్యూ, అటవీ అధికారుల టీమ్‌లతో సర్వే జరిపి కొంతమంది రైతులకు పట్టాలు ఇచ్చాం. ప్రస్తుతం తిరుమలగిరి సాగర్ మండలంలో పైలెట్ ప్రాజెక్టులో సర్వేయర్లు నిమగ్నమైనందున, అది పూర్తి కాగానే తిరిగి సర్వే చేపట్టి అర్హులైన వారికి పట్టాలు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: వానాకాలం పంటల కోతలు ప్రారంభమైనందున ధాన్యానికి ద్దతు ధర మాటేమిటి?

సబ్ కలెక్టర్: తక్కువ ధరకు ధాన్యం విక్రయించి ఇబ్బందులకు గురికావద్దు. మద్దతు ధర దక్కని పక్షంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించవచ్చు. నిబంధన ప్రకారం 17 శాతం తేమతో నాణ్యమైన సన్నధాన్యం ఐకేపీలకు తెస్తే మద్దతు ధర క్వింటాకు 2,320తో పాటు ప్రభుత్వం ఇచ్చే 500 సబ్సీడిని పొందవచ్చు.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రణాళిక



రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేందుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ నెల 25న జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణకోసం మండల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ, ఉద్యానశాఖ అధికారులతోపాటు మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్లు పతంజలి ఫుడ్ ఫీల్డ్ స్టాఫ్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- చకాచకా అడుగులు వేస్తున్న ప్రభుత్వం
- మరో 15వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- 140మంది ఏఈవోలకు ప్రత్యేక బాధ్యతలు
- 25వేల ఎకరాల్లో సాగు అయితే ఫ్యాక్టరీ ఏర్పాటు
- జిల్లాలో ప్రత్యేకంగా ఉద్యాన, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం

ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన పెంచడం వారికి నచ్చజెప్పి ఈ తోటలు సాగు చేసేలా రైతులు ముందుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాకేంద్రంలో పర్యటించిన సందర్భంగా ఆయిల్‌పామ్ సాగుపై స్పష్టత ఇచ్చారు. జిల్లాలో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ సాగయితే ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని, ఇందుకు రైతులు ప్రభుత్వం నుంచి ఇస్తున్న రాయితీలను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు కలెక్టర్ నారాయణరెడ్డి నాలుగు రోజులక్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేలా తగిన విధంగా ఆయా శాఖలు ముందుకు సాగాలని సూచించారు. వ్యవసాయశాఖ, హార్టికల్చర్‌తో సమన్వయం చేసుకోవడంతో పాటు ఏఈవోలకు కీలకమైన బాధ్యతలు ఇచ్చి ఏవోలు, ఏడీఏల సహకారం తీసుకోవడంతోపాటు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించేందుకు ముందు అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో ప్రత్యేకంగా వ్యవసాయశాఖ బాధ్యతలు

రాష్ట్రంలో ఎక్కడా లేని జిల్లాలో ఉద్యాన శాఖ, వ్యవసాయశాఖల మధ్య సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ విషయంలో వ్యవసాయ శాఖకు బాధ్యతలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ క్లస్టర్స్‌కు సంబంధించి 140 మంది ఏఈవోలు ఉన్నారు. ఈ వ్యవసాయ విస్తరణాధికారుల కింద 5వేల నుంచి 10వేల ఎకరాల వరకు ఆయా పంటల సాగుపై బాధ్యతలు ఉంటాయి. దీంతో రైతులతో వ్యవసాయశాఖ అత్యధికంగా మమేకమై ఉంటున్న నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ శాఖకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆయా మండలాలు, క్లస్టర్లలో ఏ రైతులు అయితే సాగుకు ముందుకొస్తారో గుర్తించి అవగాహన కల్పిస్తారు. జిల్లాలో ప్రస్తుతం 10వేల ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగు విస్తరించి ఉంది. దీంతో మరో 15వేల ఎకరాలు సాగు చేయాలంటే అందుకు హార్టికల్చర్ అధికారుల సంఖ్య తక్కువగా ఉండటంతో వ్యవసాయ అధికారుల సేవలను పొందాలని నిర్ణయించారు. హార్టికల్చర్ అధికారులు కేవలం ఎనిమిది మంది ఉండటంతో వారు జిల్లా అంతటా సకాలంలో ఆయిల్‌పామ్ సాగును పెంచడం కష్టంగా ఉంటుంది. దీంతో వ్యవసాయ విస్తరణాధికారులకు బాధ్యతలు ఇచ్చారు. ఒక్కో అధికారి 150 ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు నవంబర్ 10 లోగా పూర్తి చేయాలని, దీంతోపాటు డీడీలు కూడా కట్టించాలని అధికారులు సూచించారు. దీంతో ఆ వైపు వ్యవసాయశాఖ అధికారులు హార్టికల్చర్ అధికారులతో కలిసి ఆయిల్‌పామ్ విస్తరించడంకోసం ముందుకు సాగనున్నారు.

సంక్రాంతి నాటికి ఆయిల్‌పామ్ కంపెనీ ?

వచ్చే నెల 10లోగా జిల్లాలో అదనంగా మరో 15వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొస్తే, సంక్రాంతి నాటికి జిల్లాలో ఆయిల్ పామ్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో పాటు పతంజలి కంపెనీ సన్నాహలు చేస్తున్నట్లు సమాచారం. ఫ్యాక్టరీ ఏర్పాటుకు దాదాపు 200 ఎకరాలు అవసరం ఉండనుండగా

- మిగతా 8వ పేజీలో...

లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షిస్తూ జిల్లా అధికారులు మండలప్రత్యేక అధికారులుగా మండలాల్లో ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని తెలిపారు. ఆయా శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నూటికి నూరుశాతం పూర్తిచేయాలని, ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులున్నట్లయితే తన దృష్టికి తేవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంచార జాతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో భాగంగా నవంబరు 4న బీసీ కమిషన్ జిల్లాకు రానుందని, బీసీ కమిషన్ బృందం ఆ రోజు ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి అలాగే అదేరోజు సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి వివిధ సామాజిక వర్గాల వారు, ప్రజా ప్రతినిధులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తిరిమలగిరి సాగర్‌లో చేపట్టిన భూ సమస్యల పరిష్కార ప్రత్యేక ప్రాజెక్టు కింద ఇదివరకే నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సర్వే, రికార్డుల పనులు పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

గ్రామాల అధ్యయనం భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తం: కలెక్టర్

భవిష్యత్తు పరిపాలనలో అఖిల భారత సర్వీసులు, కేంద్ర సర్వీసుల అధికారులకు గ్రామాల అధ్యయనం బాగా ఉపయోగపడుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అఖిలభారత సేవలు, కేంద్ర సర్వీస్‌లకు సంబంధించిన అధికారుల బృందం ఈ నెల 21 నుంచి 28 వరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనానికి వచ్చిన విషయం తెలిసిందే. కాగా సోమవారంతో వీరి అధ్యయనం ముగియగా, జిల్లాకేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వారి అధ్యయన అనుభవాలను కలెక్టర్‌తో పంచుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు , విద్యార్థులు

నల్లగొండ టౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నల్లగొండ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్‌సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ మాట్లాడుతూ స్కాలర్ షిప్స్ ప్రభుత్వం పెట్టె భిక్ష కాదని విద్యార్థుల హక్కు అని అన్నారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్, విడుదల చేయని కారణంగా దాదాపు రూ 7,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటుతున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారిందని మండిపడ్డారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వేలమంది విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ రాని కారణంగా యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తుంటే విద్యార్థులు మానసికంగా ఇబ్బందికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులను, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి గట్టిగొర్ల శివకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సింధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మౌనేశ్వర్ చారి, నగర సంయుక్త కార్యదర్శులు చందు, శివ, విగ్నేష్, నగర ఉపాధ్యక్షుడు శివాజీ, హరి, క్రాంతి జోనల్ ఇంచార్జులు వేణు, శివమని, గణేష్, ఆకాష్, ఉదయ్ గౌతమ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాలి నాణ్యత పరికరాలు మాయం

కాలుష్య నియంత్రణ కార్యాలయంలో చోరీ? **గోప్యంగా ఉంచుతున్న అధికారులు**

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయంలో సుమారు రూ.8లక్షలు విలువైన గాలి నాణ్యత పరికరాలు చోరీ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు, ఉద్యోగులు గోప్యంగా ఉంచుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించి గాలి నాణ్యత పరీక్షించే ముఖ్యమైన పరికరాలు, రూ.లక్షల విలువ చేసే సామగ్రి దొంగతనానికి గురైనప్పుడు సంబంధిత శాఖ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. గాలి నాణ్యతను పరీక్షించే పరికరాలు ఈ నెల 22వ తేదీన చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కానీ ఇప్పటివరకు కనీసం ఉన్నతాధికారులు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వక పోవడం గమనార్హం. ఉన్నతాధికారులు తమ కార్యాలయంలో గాలి నాణ్యత పరీక్షించే పరికరాలు చోరీ అయినప్పుడు ఏవిధంగా నిర్లక్ష్యం వహిస్తున్నారనేది స్పష్టమవుతుంది. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి దృష్టికి అయిన జిల్లా ప్రాంతీయ కార్యాలయం అధికారులు తీసుకవెళ్లారా? లేదా? అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. కార్యాలయంలో తమ ఆధీనంలోని ప్రభుత్వ ఆస్తులు చోరీకి గురైనట్లు తెలిసినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాలుష్య నియంత్రణ ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యానికి తార్కాణం అన్న చర్చ సాగుతోంది. కాలుష్య నియంత్రణ కార్యాలయంలో చోరీ జరిగిన విషయం ధ్రువీకరించుకోవడంకోసం సంబంధిత శాఖ ఈఈ డాక్టర్ సంగీతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరడానికి ఫోన్ చేయగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి
బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్.కృష్ణయ్య



దేవరకొండలో బీసీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

దేవరకొండ, కొండమల్లేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. సోమవారం దేవరకొండ విష్ణు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీసీలందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. బీసీల సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలన్నారు. బీసీలకు ప్రభుత్వం రుణాలు అందజేసి తోడ్పాటు అందించాలని కోరారు. స్థానికంగా బీసీ సంక్షేమ భవనాలు ఏర్పాటు చేసుకొని మౌలిక సదుపాయాలు కల్పించుకోవాలన్నారు. జీవో 29ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల సమస్యలను పట్టించుకోలేదన్నారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ కుల గణన చేపట్టిన తరువాతే ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపాడని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అంతకుముందు కొండమల్లేపల్లిలో ఆర్.కృష్ణయ్యకు బీసీ నేతలు స్వాగతం పలికారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర సత్యనారాయణ, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆలంపల్లి నర్సింహ,సిరాజ్‌ఖాన్, జాన్‌యాదవ్, శిరందాసు కృష్ణయ్య, కొర్ర రాంసింగ్, చొల్లేటి భాస్కరచారి, ఎస్‌ఎన్.చారి పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో రైతులకు రుణాలు సకాలంలో అందజేస్తుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండలో జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డివిజన్‌స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. సహకార బ్యాంక్ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు డాక్టర్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, జాల నర్సింహరెడ్డి పాల్గొన్నారు.


నాన్ జ్యుడీషియరీ స్టాంప్‌పేపర్ల విక్రయాలపై డీఆర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 28: నాన్ జ్యుడీషియరీ స్టాంప్ పేపర్ల విక్రయాల్లో కొందరు స్టాంప్ వెండర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ విధానానికి స్వస్తిపలికి మ్యాన్‌వల్ స్టాంప్‌పేపర్లను విక్రయిస్తున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో 'ఆఫ్‌లైన్‌లో నాన్‌జ్యుడీషియరీస్టాంప్ పేపర్లు' అనే కథనం సోమవారం ప్రచురితమైంది. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ స్పందించారు. మిర్యాలగూడ ప్రాంతంలో జరుగుతున్న అక్రమాలపై స్థానిక సబ్ రిజిస్ట్రార్‌నుంచి వివర కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్యాలయ అధికారులు ఆఫ్‌లైన్‌లో బాండ్‌పేపర్లను విక్రయిస్తున్న డాక్యుమెంట్ వెండర్‌ను గుర్తించి శాఖాపరమైన చర్యల నిమిత్తం డీఆర్‌కు నివేదిక పంపినట్లు తెలిసింది. అదేవిధంగా మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని డాక్యుమెంట్ వెండర్లతో సబ్ రిజిస్ట్రార్ బలరాం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అక్రమాలకు తావించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్‌జైలు రిమాండ్ ఖైదీ పరారీకి యత్నం

● అదుపులోకి తీసుకున్న జైలు సిబ్బంది
● భువనగిరి జిల్లాకేంద్రంలో ఘటన



7

ఖైదీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



నిడమనూరులో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి.

నిడమనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. నిడమనూరులో సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించి ఆ పార్టీ సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడంతో ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మతం పేరిట రాజకీయం చేయడంతో పాటు కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తుందని ఆరోపించారు. భూస్వాములు, పెట్టుబడిదారుల కొమ్ము కాస్తూ పేదలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి పని చేస్తుందన్నారు. కష్టజీవుల పక్షాన తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేయడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు జిల్లా కారద్యర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, మల్లికంటి చంద్రశేఖర్, నల్లబోతు సోమయ్య, కొండేటి సామంత్, బాల నారాయణ, కేశవులు, సైదులు పాల్గొన్నారు.

కళలకు జీవం పోస్తూ..

కళల్లో మేటిగా నిలుస్తోన్న యాదగిరి

● నటుడిగా, శిక్షకుడిగా రాణింపు
● బాలలు, యువతకు శిక్షణ

కళలు కనుమరుగు కాకుండా భావితరాలకు అందించాలనే తపన ఆయనది. ఇప్పటికే అనేక అంశాల్లో బాలలు, యువతకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారిని తన నాటక ప్రదర్శనల్లో భాగస్వామ్యం చేస్తున్నారు. కళలకు జీవం పోస్తున్నారు. ఆయనే సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామానికి చెందిన బాసంపల్లి యాదగిరి.


శ్రీరాముడి వేషధారణతో యాదగిరి

(ఆంధ్రజ్యోతి-పెన్‌పహాడ్)

గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వర స్వామి ఆలయాల ప్రతిష్ఠాపన పూజారిగా చేసే యాదగిరి స్వస్థలం వరంగల్ జిల్లా మహబూబాద్ మండలం కంబాలపల్లి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామాల్లో కంఠమహేశ్వరస్వామి ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించడం, భార్యతో కలిసి గౌడ పురాణాలు చెబుతూ జీవిస్తుంటారు. 30ఏళ్ల క్రితం కంఠమహేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా సురభి కళాకారుల ప్రదర్శనను చూసి నాటకాలకు ఆకర్షితుడయ్యాడు. సురభి సంస్థలో చేరి చిన్నచిన్న వేషాలు వేస్తూ నటన, సంగీతం, సాహిత్యంపై పట్టు సాధించి అగ్రశ్రేణి కళాకారుడిగా పేరుగాంచారు.

జీవనోపాధి కోసం వలస వచ్చి

జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం యాదగిరి కుటుంబంతో సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. మొదటగా సూర్యాపేటలో భానుపురి ఐక్య కళావేదికను స్థాపించారు. నెమ్మికల్ గ్రామంలో జ్యోతి యువజన నాట్య కళామండలి పేరుతో ఉన్న సంస్థ మరుగునపడగా దానిని పునరుద్ధరించారు. పద్యనాటకాల్లో యాదగిరి వివిధ పాత్రలు పోషిస్తూనే హార్మోనియం, తబలా వాయించడంలో ప్రావీణ్యం సాధించారు.


దమయంతి స్వయంవరం నాటక ప్రదర్శనలో యాదగిరి(రౌండప్‌లో)

శిక్షణ, పలు గ్రామాల్లో ప్రదర్శన

ఇప్పటికే 120 మంది బాలలు, యువతీ, యువకులకు యాదగిరి పౌరాణికం, భాగవతం, హరికథ, బుర్రకథ, సాంఘిక పద్య నాటకాల్లో శిక్షణ ఇచ్చారు. ఇప్పటికీ ఆయన వద్ద చాలా మంది శిక్షణ పొందుతున్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్,ఆత్మకూరు(ఎస్), సూర్యాపేట, చివ్వెంల, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ చెందిన ఎంతోమందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారు. దాతల సహకారంతో కందగట్ల గ్రామంలో చింతామణి నాటకం, తుంగతుర్తి, నెమ్మికల్, ఏపూర్‌లో సత్య హరిశ్చంద్ర నాటకం, సూర్యాపేటలో శ్రీకృష్ణరాయభారం, నెమ్మికల్, నాగులపాటిఅన్నారం గ్రామాల్లో స్వయంవరం పద్య నాటకాలను పలు మార్లు ప్రదర్శించారు. తన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులను తన ప్రదర్శనలో భాగస్వామ్యం చేస్తున్నారు. తన కుమారులు జగదీష్, మనోహర్‌లకు నాటక ప్రదర్శనలో శిక్షణ ఇవ్వడంతో పాటు హార్మోనియం, తబలా కళాకారులుగా తీర్చిదిద్దారు.

చిన్నారులను తీర్చిదిద్దడమే లక్ష్యం



చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఇందు కోసం పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను కలుస్తుంటా. వారికి నాటకాలపై ఆసక్తి పెరిగేందుకు కృషి చేస్తా. శిక్షణ ఇచ్చి వారిని నాటక ప్రదర్శనలో అవకాశం కల్పిస్తా. పద్య, పౌరాణిక నాటకాలు అంతరించిపోకుండా ఉండేందుకు కృషి చేస్తున్న.

యాదగిరి, కళాకారుడు

అనేక పాత్రలకు జీవం

యాదగిరి అనేక పౌరాణిక పాత్రలకు జీవం పోస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. శ్రీకృష్ణరాయభారంలో కృష్ణుడు, అర్జునుడిగా, సత్యహరిశ్చంద్ర నాటకంలో సత్యహరిశ్చంద్రుడు, దమయంతి స్వయంవరంలో నల చక్రవర్తి, చింతామణి నాటకంలో బిల్వమంగళుడు, రామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడు, ఆంజనేయస్వామి పాత్రలకు జీవం పోశారు. ఏకపాత్రాభియనాల ప్రదర్శనలో ఆయనకు ఆయనే సాటి. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, గాయకులు, రచయితలు నుంచి యాదగిరి ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాజు కళామందిరం సంస్థ ప్రతినిధులు యాదగిరి కళా నైపుణ్యాన్ని గుర్తించి జాతీయ స్థాయి నంది అవార్డు అందజేశారు.



ఓ వైపు అంగన్‌వాడీ టీచర్‌గా కొనసాగుతూనే తన పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న కులవృత్తి అంతరించిపోకుండా కృషి చేస్తోంది యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలానికి చెందిన రాపాక భాగ్యలక్ష్మి. 10 ఏళ్లుగా పౌరోహితురాలిగా, హరిదాసు వేషధారణలో సంకీర్తనలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ పురాతన ఆధ్యాత్మిక సంకీర్తనలు ఇప్పటి తరానికి తెలియజేస్తున్నారు. భాగ్యలక్ష్మి తండ్రిని మించి తనయురాలుగా, అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. (ఆంధ్రజ్యోతి-రాజాపేట)

సంకీర్తనల మేలుకొలుపు

● హరిదాసుగా, మహిళా పురోహితురాలిగా రాణిస్తున్న రాపాక భాగ్యలక్ష్మి
● తండ్రి బాటలోని తనయురాలు
● ధనుర్మాసంలో మేల్కొలుపు సంకీర్తనలు

రాజాపేట మండల కేంద్రానికి చెందిన రాపాక భాగ్యలక్ష్మి, 10 ఏళ్లుగా మండల కేంద్రంలో పౌరోహిత్యాన్ని నిర్వహిస్తున్నారు. భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు రాపాక మురళీ-రమాదేవి వారికి ఈమె ఒక్కతే సంతానం. డిగ్రీ వరకు చదువుకున్న భాగ్యలక్ష్మి తన తండ్రి మురళీ గ్రామంలో హరిదాసుగా, పౌరోహితుడిగా పూజలు నిర్వహించేవారు. మురళీ సంకీర్తనలు రాజాపేట మండల ప్రజలను అప్పట్లో ఎంతో అలరించాయి. ఆయన గ్రామంలో హరిదాసు వేషధారణలో సంకీర్తనలు చేసేవారు. మురళీ 15 జనవరి 2013న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి చెందిన తర్వాత ఆయన వారసురాలు భాగ్యలక్ష్మి హరిదాసు, పౌరోహిత్యం నిర్వహిస్తోంది. చిన్నప్పుడు తన తండ్రితో పాటు కార్యక్రమాలకు వెళ్లి అభ్యాసనం చేసింది. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆమె మహిళా హరిదాసుగా, మహిళా పౌరోహితురాలిగా రాణిస్తోంది. గ్రామంలో ప్రతీ ఏడాది సంక్రాంతికి ముందు ధనుర్మాసంలో నెల రోజుల పాటు హరిదాసు వేషధారణలో తల్లి రామదేవితో కలిసి ఊరంతా కలియ తిరుగుతూ సంకీర్తనలు చేస్తూ తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు శ్రీకృష్ణుడు-గోదాదేవి, సంబంధించిన సంకీర్తనలు చేస్తూ వాటి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ గ్రామస్తులను మేలుకొల్పుతుంది.

అదేవిధంగా గ్రామంలో పౌరోహితురాలిగా పనిచేస్తూ వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వినాయక విగ్రహాల మండపాలు, దుర్గామాత విగ్రహాల వద్ద, నూతన గృహప్రవేశాలు, వ్రతాలు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అదేవిధంగా దళిత వాడల్లో పెళ్లిళ్లకు, శుభకార్యాలకు, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు తోచిన విధంగా చేసిన ధనం స్వీకరిస్తోంది. మహిళా పౌరోహితురాలిగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.


ఇంటింటికి తిరిగి వస్తువులను సేకరిస్తున్న భాగ్యలక్ష్మి

వారసత్వాన్ని కాపాడటమే లక్ష్యం

వారసత్వాన్ని కాపాడటమే నా లక్ష్యం. పూర్వీకుల నుంచి వస్తున్న కులవృత్తి అంతరించిపోకుండా ఉండేందుకే నిర్వహిస్తున్నా. నేటి తరానికి సంస్కృతి, సంప్రదాయం తెలియజెప్పాలనే నా కర్తవ్యం. సంకీర్తనలతో ప్రజలను హైందవ సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నాం.

రాపాక భాగ్యలక్ష్మి, మహిళా హరిదాసు

నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నల్లగొండ టౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024కు సంబంధించి స్పెషల్ ఎడ్యుకేషన్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం డీఈవో కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు డీఈవో భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తిలో ఎంపికై అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్స్, లేటెస్ట్ పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మోడల్ విద్యార్థులు


ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కనగల్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): కనగల్ మోడల్ స్కూల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పి.పావని, ఎ.శివ, పదోతరగతి విద్యార్థి ఎం.ప్రశాంత్‌రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ థామస్, పీడీ విజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి మహబూబ్‌నగర్‌లో జరుగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



బంతి సాగు..భలే బాగు

● చెర్వుగట్టులో బంతిపూల సాగు చేస్తున్న యువ రైతు
● కూరగాయల స్థానంలో బంతి పూదోట

నార్కట్‌పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలతో పాటు సీజనల్ పంటల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు యువ రైతు దొడ్డి రాకేష్. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన దొడ్డి పరుశురాములుకు ఆరు ఎకరాల భూమి ఉంది. వీటిలో రెండు ఎకరాల్లో వరి, మూడు ఎకరాల్లో టమాట సాగు చేస్తుండగా అతడి కుమారుడైన యువరైతు రాకేష్ డిగ్రీ పూర్తిచేశాడు. సీజనల్ పంట సాగు కింద ఈ పర్యాయం సుమారు ఎకరం విస్తీర్ణంలో బంతిపూల సాగు చేపట్టారు. నర్సరీ మొక్కలకు ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 10వేల మొక్కలు తెచ్చి జూలైలో నాటారు. ఒక్కొక్క వరుసలో 300మొక్కలు ఉండేలా 34నిలువు వరుసల్లో 10 వేల మొక్కలు నాటారు. డ్రిప్‌తో నీటిని అందించారు. భూమి చదును చేసేందుకు, మొక్కలు నాటేందుకు కూలీల ఖర్చు అంతా కలిపి రూ. 30వేల వరకు వచ్చింది. క్రిమిసంహారక మందులకు రూ.3,000ల వరకు ఖర్చయ్యింది. అయితే జూలైలో నాటగా బతుకమ్మ, దసరా పండుగల నాటికి మొదటిసారి సుమారు 600 కిలోలు దిగుబడి వచ్చింది. డిసెంబరు చివరనాటికి ఇలా మూడు పర్యాయాలు పూలు దిగుబడి వస్తుండగా ప్రస్తుతం రెండో పర్యాయం పూలు కోయడానికి సిద్ధంగా ఉంది. హోల్‌సేల్‌గానే కాకుండా రిటైల్‌గా కూడా పొలం వద్దే రైతులకు విక్రయిస్తున్నారు.

మొదటి ప్రయత్నంగా బంతి సాగు



బంతి పూలు సాగు చేసిన ఎకరం భూమిలో గతంలో టమాట సాగు చేశాం. ఈ పర్యాయం భిన్నంగా సాగు చేద్దామనే నా ఆలోచనలో భాగంగా మొదటి ప్రయత్నంగా బంతి పూల సాగు చేపట్టాం. టమాట సాగు కన్నా బంతి పూల సాగు కొంత కష్టం. కిలో బంతిపూలను రూ.80 చొప్పున విక్రయిస్తున్నాం. పెద్ద పరిమాణంలో తీసుకుంటే హోల్‌సేల్ ధరకు విక్రయిస్తున్నాం. అన్నీ ఖర్చులు పోను మూడు దిగుబడులకు కలిపి రూ.60 వేల వరకు లాభం వస్తుందని ఆశిస్తున్నాం.

దొడ్డి రాకేశ్, యువరైతు, చెర్వుగట్టు

జాతీయ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సంస్థాన్ విద్యార్థిని



ఇండియన్ స్కూల్ సోహార్ తరఫున పాల్గొన్న సూరపల్లి స్పందన

సంస్థాన్ నారాయణపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాద్రాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన సూరపల్లి స్పందన సీబీఎస్ఈ జాతీయ చెస్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో పాల్గొన్నారు. స్పందన తల్లిదండ్రులు సూరపల్లి ధనుంజయ్, చందన ఒమన్‌లో ఉపాధి పొందుతూ అక్కడే సోహార్ పట్టణంలో నివసిస్తున్నారు. అక్కడి ఇండియన్ స్కూల్లో 11వ తరగతి చదువుతోంది. ఏటా సీబీఎస్ఈ నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది క్లస్టర్ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు ఒమన్ రాజధాని మస్కట్‌లో జరిగాయి. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఇండియన్ స్కూల్ సోహార్ జట్టు జాతీయస్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. ఈ పోటీలు పంజాబ్‌లోని జలంధర్‌లో లాచి బ్లసూమ్ స్కూల్లో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో సంస్థాన్‌నారాయణపురానికి చెందిన స్పందనతో పాటు ఇండియన్ స్కూల్ సోహార్‌కు చెందిన తమిజ్ తలవం రామర్, ఐశ్వర్య సాజి, హర్షిని గుడ్డేటి, ఉపాధ్యాయురాలు రాధాబిషట్ పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శించిన బౌద్ధ గురువులు

నాగార్జునసాగర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో తెలంగాణ పర్యాటక శాఖ నిర్మించిన బుద్ధవనాన్ని సోమవారం వివిధ బౌద్ధ విహారాలకు చెందిన బౌద్ధ గురువులు సందర్శించారు. సికింద్రాబాద్ లోని మహాబోధి బుద్ధ విహారలో నిర్వహించిన చివర దాన వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బుద్ధవనం మెంటార్ చెన్నూరి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బౌద్ధ గురువులు, భిక్షువులు, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం చేరుకున్న వీరు ముందుగా బుద్ధచరిత వనంలోని బుద్ధుడి పాదాల వద్ద ప్రార్థనలు చేశారు.


బుద్ధుడి పాదాలకు నమస్కరిస్తున్న బౌద్ధ గురువులు

అనంతరం వందన సమర్పణతో పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతక పార్కు, స్థూప పార్కు, అవకాన బుద్ధ ధ్యానవనం సందర్శించారు. మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బౌద్ధ సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు నిర్వహించి ధ్యానం చేశారు. బుద్ధవనం విశేషాలను ఆంజనేయరెడ్డి తెలియజేశారు. బుద్ధవనం సందర్శించిన వారిలో అసోం బర్పాకియాల్ బుద్ధ విహార బౌద్ధగురువు ఏటిక మహాతేరో, బెంగళూరు మహాబోధి బుద్ధవిహారకు చెందిన ఆనంద్, బుద్ధ దత్త, సంఘపాల, బుద్ధ పాల బంతేలు ఉన్నారు. వీరితో పాటు బుద్ధవనం స్థపతి హరిప్రసాద్, డిజైన్ ఇన్‌చార్జి శ్యాంసుందర్‌రావు,సూపర్‌వైజర్ విష్ణు ఉన్నారు.

నరసింహ నామం.. కళారత్న పురస్కారం



బీఎస్ఏ మైక్రో లెటర్స్ విభాగంలో పురస్కారం అందుకుంటున్న గేయవర్షిణి


బియ్యపు గింజలపై గేయవర్షిణి రాసిన 'నరసింహ' నామాలు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక విభాగాల్లో అవార్డులు అందజేసే బీఎస్ఏ మైక్రో లెటర్స్ రైటింగ్ విభాగంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన గేయవర్షిణి జాతీయ కళారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన స్టేట్ కాన్ఫరెన్స్‌లో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గేయవర్షిణికి అవార్డు అందజేశారు. మిర్యాలగూడ రెడ్డీకాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాస్, శ్రీ లక్ష్మి దంపతుల కుమార్తె గేయవర్షిణి ఇంటర్ చదివి ఫైన్ ఆర్ట్స్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిన్న వయస్సులో గేయవర్షిణి 30 వేల బియ్యపు గింజలపై నరసింహ నామాన్ని రాసి తన భక్తిని చాటుకున్నారు.

యోగా పోటీల్లో సంధ్యకు ప్రథమస్థానం


సంధ్యకు అవార్డు అందజేస్తున్న రవికిషోర్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన బోధి ధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ యోగా శిక్షకురాలు కొయ్యడ సంధ్యకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ యాక్టివ్ పెన్షనల్ డే సందర్భంగా ఆదియోగి పరమేశ్వర్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా యోగా టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ (టీవైటీసీ) చైర్మన్ యోగాచారి రవికిషోర్ నుంచి ఆమె ప్రశంసాపత్రం, మెడల్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ సత్తిరెడ్డి, చైర్మన్ సిద్ధిరాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మఠంపల్లి విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పీఈటీలు

మఠంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 27న పాఠశాల గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 14, 17 విభాగాల్లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని మాన్‌పోర్టు, వర్ధాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -14 విభాగంలో మాన్ పోర్టు పాఠశాలకు చెందిన బి.యశ్వంతి, బి.హర్షిత, ఐ.హర్షితతో పాటు వర్ధాపురం పాఠశాలకు చెందిన ఎస్.హర్షితలు ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించారు. అండర్ -17 విభాగంలో వర్ధాపురం విద్యార్థి ఎస్.మల్లేశ్వరి ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచి బహుమతి గెలుచుకున్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలకు సూర్యాపేట జిల్లా తరుపున మఠంపల్లి మండల విద్యార్థులు పాల్గొంటారని పీఈటీలు వీరస్వామి, సతీష్ తెలిపారు. విద్యార్థినుల ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

నేనున్నాననీ.. మీకేం కాదనీ



మద్దిరాల(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు ఓ ఎన్ఆర్ఐ చేయూతనందించారు. తండాల నుంచి పాఠశాలకు రావడానికి రవాణా చార్జీలను చెల్లించారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చిననెమిల గ్రామ ఆవాస ప్రాంతాలైన గుట్టకాడితండా, సెట్రామ్‌తండా, సాముల తండాల నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిననెమిల జిల్లా పరిషత్ పాఠశాలకు రావడానికి ఎనిమిది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న చిననెమిల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దామెర సంతోష్ విద్యార్థుల కోసం ఈ ఏడాది జూలై నుంచి రవాణా చార్జీలను చెల్లించారు. చిన నెమిల జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రతిరోజు తీసుకువచ్చి, వదిలిపెట్టడానికి ఆటో డ్రైవర్‌కు ప్రతి నెలా రూ.6వేల చొప్పున నవంబరు వరకు రూ.30వేలను ఎన్ఆర్ఐ సంతోష్ చెల్లించినట్లు పాఠశాల హెచ్ఎం వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు అధికారుల బదిలీ

నల్లగొండ/ నల్లగొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు బదిలీల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికారులకు స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీల ప్రక్రియలో భాగంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో సూర్యాపేట అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న బీఎస్ లతను, జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా అక్కడ పనిచేస్తున్న టి.రాంబాబును సూర్యాపేటకు బదిలీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ బెన్‌షాలోం నారాయణపేటకు బదిలీచేశారు. నల్లగొండ అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రను మైనార్టీ వెల్ఫేర్‌కు బదిలీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న పి.అమరేందర్‌ను నల్లగొండ డీఆర్వోగా బదిలీచేశారు. నల్లగొండ డీఆర్వోగా కొనసాగుతున్న డి.రాజ్యలక్ష్మికి హెచ్ఎండీఏకు స్థానచలనం కల్పించారు. నల్లగొండ ఆర్డీవోగా పనిచేస్తున్న ఎస్.రవిని హనుమకొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పీఏగా బదిలీ చేయగా, హెచ్ఎండీఏ పరిధిలో పనిచేస్తున్న వై.శేఖర్‌రెడ్డిని నల్లగొండ ఆర్డీవోగా నియమించారు. ఇప్పటివరకు వెయిటింగ్‌లో ఉన్న ఎస్.రమణారెడ్డి దేవరకొండ ఆర్డీవోగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి డీడబ్ల్యూవోగా పనిచేస్తున్న ఎం.కృష్ణారెడ్డిని భువనగిరి ఆర్డీవోగా, వెయింటింగ్ లిస్టులో ఉన్న జి.వెంకటేశ్వర్లును ల్యాండ్ అక్విడేషన్ ఎస్‌డీసీగా పోస్టింగ్‌లు కల్పించారు.

ఖోఖో పోటీలు షురూ...



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పోటీల్లో క్రీడా వందన స్వీకరిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో టోర్నీ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పోటీల్లో నల్లగొండ, ఆదిలాబాద్ జట్లు తలపడ్డాయి. టోర్నీలో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న నల్లగొండ, ఆదిలాబాద్ జట్లు

డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం

భారత న్యాయ వ్యవస్థ, చట్టాల్లో లేని డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్ల అరాచకాలు క్రమేపీ పెరుగుతున్నాయి. తెలియని నెంబర్ నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను ఎత్తిన బాధితులు సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్ట్ పేరిట చేస్తున్న బెదిరింపులకు భయపడి కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్ట్ పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని అసలు ,ఆ చట్టమే దేశంలో లేదని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● భువనగిరి టౌన్,(ఆంధ్రజ్యోతి)

డిజిటల్ అరెస్ట్ చట్టమే లేదు



డిజిటల్ అరెస్ట్ అనే పదం చట్టాలు, న్యాయ వ్యవస్థలో లేనేలేదు. తెలియని నెంబర్ల ద్వారా వచ్చే వీడియో కాల్స్ ఎత్తవద్దు. ఎత్తినా సైబర్ నేర గాళ్ల కనెక్ట్ అయిన వెంటనే అప్రమత్తతతో ఫోన్‌ఎత్తిన వాళ్ల సమాధాన మివ్వొద్దు. అయినప్పటికీ బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బ్యాంకులు సహా ఆర్థిక సంస్థలు ఫోన్ల ద్వారా బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అడగవు.

-బొట్టు కృష్ణ, విశ్రాంత ఏసీపీ, క్రాపాయిపల్లి, ఆత్మకూరు(ఎం) మండలం.

డిజిటల్ అరెస్ట్ పేరిట నష్టపోవద్దు



డిజిటల్ అరెస్ట్ పేరిట వచ్చే బెదిరింపులకు ఎవరూ భయపడవద్దు. డిజిటల్ అరెస్ట్ అనే పదమే చట్టంలో లేదు. సైబర నేరగాళ్ల మోసాల్లో కొత్త తరహా మోసమిది. నిజంగా నేరాలు చేస్తే పోలీసులు నేరుగా అరెస్ట్ చేస్తారు అవసరమైతే బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేస్తారు. ఆస్తులను జప్తు చేస్తారు ఈమెయిల్స్, సెల్‌ఫోన్ల ద్వారా విచారణ, దర్యాప్తు చేయరు.

● వాకిటి ఇంద్రసేనారెడ్డి, న్యాయవాది, భువనగిరి.


తెలియని ఫోన్ నంబర్లతో నగదు బదిలీ చేయొద్దు



తెలియని ఫోన్ నంబర్లు, ఈ మెయిల్స్ ఆధారంగా ఎవరూ నగదు బదిలీలు చేయవద్దు. బ్యాంక్ వివరాలు చెప్పొద్దు. సైబర్ నేరగాళ్ల ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగవద్దు. ముఖ్యంగా ధనవంతులు, బ్యాంక్ డిపాజిట్‌దారులు, భారీ మొత్తంలో బ్యాంక్ లావాదేవీలు నిర్వహించేవారు బెదిరింపు కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆదాయ, వాణిజ్య పన్ను, జీఎస్టీ తదితర అధికారులు వీడియో కాల్స్ ద్వారా విచారణ చేయరని తెలుసుకోవాలి.

● కందుకూరి బ్రహ్మం, ట్యాక్స్ కన్సల్టెంట్, భువనగిరి.

అవగాహనతోనే మోసాలకు దూరం



అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ మోసాల నుంచి తప్పించుకోవచ్చు, ఎలాంటి ఆర్థిక వ్యవస్థలు క్లయింట్లతో ఆర్థిక కార్యకలాపాలు, విచారణ, దర్యాప్తు చేయబోవని తెలుసుకోవాలి. అయితే డిజిటల్ అరెస్ట్ పేరిట మోసపోతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉంటుండడం బాధాకరం. అత్యాశకు పోవద్దు, బెదిరింపులకు లొంగవద్దు. డిజిటల్ అరెస్ట్ లేనే లేదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొనడాన్ని అందరూ గమనించాలి.

● కె. రఘుపతిరెడ్డి, హోమియో వైద్యుడు, భువనగిరి.

విత్తమేదీ?.. ఉత్పత్తి ఏదీ?

● విత్తనోత్పత్తి క్షేత్రాలపై నిర్లక్ష్యం ● డిండి, చెర్కుపల్లి గ్రామాల్లో విత్తనోత్పత్తి క్షేత్రాలు ● నిధుల కేటాయింపులేక రెండేళ్లుగా సాగుకు నోచని వైనం

డిండి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు మేలైన విత్తనాలు అందించేందుకు ఏర్పాటు చేసిన విత్తన ఉత్పత్తి క్షేత్రాలు ఒట్టిపోతున్నాయి. పేరుకు మాత్రమే భూమి కేటాయించిన ప్రభుత్వం విత్తనోత్పత్తి క్షేత్రాలకు నిధులు కేటాయించకపోవడంతో భూములు బీడుగా మారుతున్నాయి. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని రైతుల వద్ద 1949లో 176 ఎకరాలను అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ భూమిని విత్తనోత్పత్తి చేసేందుకు వ్యవసాయశాఖకు అప్పగించింది. మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో కూడా విత్తనోత్పత్తి చేసేందుకు వ్యవసాయశాఖ ఆధీనంలో మరో 50 ఎకరాల భూమి ఉంది. డిండి మండలకేంద్రంలో 95.30 ఎకరాలు మెట్ట పంటలు సాగుచేసేందుకు 80.12 ఎకరాలు, వరి సాగుచేసి మేలైన విత్తనాలు ఉత్పత్తి చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రాలకు డిండి ప్రాజెక్టు నుంచినీటిని అందించి వ్యవసాయశాఖ మేలు రకమైన విత్తనాలను ఉత్పత్తి చేయాల్సి ఉంది. రెండేళ్లుగా అరకొర నిధుల కేటాయింపుతో క్షేత్రాలు బీళ్లుగా మారాయి. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ బై బ్యాక్ ఒప్పందం మేరకు సాగుచేసేందుకు విత్తనాలను అందజేస్తుంది. విత్తనోత్పత్తి క్షేత్రాల్లో పండించిన విత్తనాలను తెలంగాణ సీడ్ కార్పొరేషన్ కొనుగోలుచేసి రాయితీపై రైతులకు అందిస్తుంది. బడ్జెట్ కేటాయింపులేకపోవడంతో రెండేళ్లుగా వ్యవసాయ క్షేత్రాలు బీళ్లుగానే ఉన్నాయి. సరైన సమయంలో బడ్జెట్ నిధులు కేటాయించకపోవడంతో రైతులు వరి నాట్లువేసి కలుపు తీసే సమయంలో విత్తనోత్పత్తి క్షేత్రంలో వరినాట్లు వేసే సందర్భాలు అనేకం ఉన్నాయి. 2023-24సంవత్సరంలో 50ఎకరాల్లో సాగుచేసిన కంది విత్తనాలను తెలంగాణ సీడ్ కార్పొరేషన్ తీసుకోకపోవడంతో ఈనెల 24వ తేదీన వేలం వేశారు. విత్తన ఉత్పత్తి చేసేందుకు అన్ని వసతులు ఉన్నా నిధుల కేటాయింపులేక విత్తనోత్పత్తి క్షేత్రాల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి.



బీడుగా ఉన్న డిండి విత్తనోత్పత్తి క్షేత్రం



2020-21 ధరల ప్రకారమే నిధుల మంజూరు

విత్తనోత్పత్తి క్షేత్రంలో చేసే సాగుకు 2020-21 ధరల ప్రకారం వ్యవసాయశాఖ నిధులు విడుదల చేస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రేట్లకు, ప్రస్తుతం ఉన్న రేట్లకు పొంతనలేకపోవడంతో విత్తనోత్పత్తి క్షేత్రంలో సాగు ముందుకు సాగడంలేదు. కూలీల చెల్లింపులు, ట్రాక్టర్లతో దమ్ము, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కొనుగోలు ఇతన ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడంలేదని అధికారులు చెబుతున్నారు. అన్నిం టికీ ధరలు పెరగడంతో ఎకరాకు ప్రభుత్వం కేటాయించే నగదు సరిపోదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత సంవత్సరం పనిచేసిన కూలీలకు, ట్రాక్టర్ల యజమానులకు ఇప్పటివరకు డబ్బులు అందలేదు. దీంతో వ్యవసాయ క్షేత్రంలో పనిచేసేందుకు కూలీలు ముందుకు రావడంలేదు. 2022-23 సంవత్సరంలో పండించిన సుమారు 50క్వింటాళ్ల పెసర్లు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ తీసుకోకపోవడంతో అవి నాగర్‌కర్నూల్‌లోని ఓ కోల్డ్ స్టోరేజీలోనే ఉన్నాయి. పెసర్ల విలువకంటే కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసినందుకు చెల్లించే చార్జీలే ఎక్కువవుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే అక్టోబరు చివరినాటికే వేరుశనగ విత్తాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు విత్తనోత్పత్తి క్షేత్రాన్ని దుక్కి దున్ని చదును చేయలేదు. రైతులు వేరుశనగ విత్తనాలువేసి 40రోజులు కావస్తున్నప్పటికీ అధిక దిగుబడులు ఇచ్చే నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే విత్తనోత్పత్తి క్షేత్రంలో ఇంకా వేరుశనగ విత్తలేదు. ● ఈ విషయమై సీడ్ ఫామ్ ఏడీఏ నివేదితను వివరణ కోరగా ఈ యాసంగిలో డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో 50ఎకరాల్లో వేరుశనగ, మరో 50 ఎకరాల్లో వరి సాగు చేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు			
జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	220	250
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.145	212	240

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.70
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,791
కుడికాల్వకు	10160
విద్యుత్ కేంద్రం ద్వారా	29,679
క్రస్ట్ గేట్ల ద్వారా	96,324
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	67,479 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	69,310 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.49 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	45,820 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44,222 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.94 అడుగులు
టీఎంసీలు	4.18
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	845. 10 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	426.25 క్యూసెక్కులు

సబ్‌జైలు రిమాండ్ ఖైదీ పరారీకి యత్నం

● కడుపునొప్పి అని చెప్పడంతో ఆసుపత్రికి తీసుకొచ్చిన సిబ్బంది ● చికిత్స అందించే క్రమంలో పారిపోయే యత్నం ● అదుపులోకి తీసుకున్న జైలు సిబ్బంది

భువనగిరి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువచ్చిన భువనగిరి సబ్ జైల్ రిమాండ్ ఖైదీ తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సబ్ జైలు రిమాండ్ ఖైదీ తప్పించుకునే ప్రయత్నం, జైలు సిబ్బంది పరుగెత్తి పట్టుకున్న వైనం బహిర్గతమైంది. భువనగిరిలో ఓ మైనర్ బాలికను ప్రలోభపెట్టి లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితుడైన భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కారు మెకానిక్ ఖాజాఖాన్‌ను పోలీసులు ఈ నెల 16వ తేదీన అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో భువనగిరి సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఖాజాఖాన్ పలు దఫాలుగా అనారోగ్యంగా ఉందని చెబుతుండటంతో జైలు సిబ్బంది భువనగిరి జిల్లా ఆసుపత్రికి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న కూడా కడుపు నొప్పి వస్తోందని ఖాజాఖాన్ చెప్పడంతో అదే రోజున సబ్ జైలు సిబ్బంది జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇదే అదనుగా చేతికి ఉన్న బేడీలను తొలగించుకుని ఆసుపత్రి నుంచి పరారయ్యేందుకు పరుగులు తీస్తూ ఆసుపత్రి ప్రహరీని దూకి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జైలు సిబ్బంది కూడా గోడను దూకి రహదారిపై వెంటాడుతూ అదుపులోకి తీసుకుని సబ్ జైలుకు తరలించారు. తప్పించుకునే ప్రయత్నంలో రిమాండ్ ఖైదీ కాలుకు స్వల్ప గాయం అయ్యింది.

ఈ మేరకు సబ్ జైలు సూపరింటెండెంట్ నెహ్రూ స్పందిస్తూ పారిపోయేందుకు ఖాజాఖాన్ చేసిన ప్రయత్నాలను జైలు కానిస్టేబుల్స్ అడ్డుకుని అదుపులోకి తీసుకొని సబ్ జైలుకు తరలించారని పేర్కొన్నారు. జరిగిన ఘటనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. నిమిషాల వ్యవధిలో అప్రమత్తమై రిమాండ్ ఖైదీని అదుపులోకి తీసుకున్న సిబ్బందిని అభినందించారు.



భువనగిరి జిల్లా ఆసుపత్రిలో జైలు సిబ్బందితో ఖాజాఖాన్

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధిస్తున్న యువకుడిపై సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సూర్యాపేట పాఠశాలలో చదువుతోంది. పట్టణానికి చెందిన మట్టపల్లి ఉదయ్ అనే యువకుడు ఏడాదిగా బాలికను వేధిస్తున్నాడు. బాలిక కుటుంబసభ్యులు పలుమార్లు హెచ్చరించినా ప్రవర్తన మార్చుకోకపోవడంతో బాలిక తల్లిదండ్రులు ఆత్మకూర్(ఎస్) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్‌పై పోక్సోకేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని రామాపురంలో రోడ్డులో ఆటోలో తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి తరలిస్తుండగా సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల శివాజీనగర్‌కు చెందిన ఇంజమూరి సురేష్ రేషన్ బియ్యాన్ని తన ఇంట్లోని పిండి మిల్లు ద్వారా నూకలుగా మార్చి వాటిని పెన్‌పహాడ్ మండలం అనంతారం వద్ద కోళ్ల ఫారంలో విక్రయించడానికి ఆటోలో తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 16 బస్తాల్లో నింపిన 8 క్వింటాళ్ల నూకలుగా మార్చిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

చౌటుప్పల్ రూరల్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అల్లాపురంలో సోమవారం జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలను ఎట్టమ్మ(70) ఆదివారం సాయంత్రం తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఎట్టమ్మతో ముచ్చటించి మంచి నీళ్లు కావాలని అడిగాడు. ఇంట్లోకి వెళ్లి నీళ్లు తెచ్చి ఇస్తుండగా ఎట్టమ్మపై దాడి చేసి మూడు తులాల బంగారు గొలుసు అపహరించి పారిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


ప్రభుత్వ భూమిలో కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చి వేస్తున్న ఎక్స్‌కవేటర్

దామరచర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఇటీవల నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు సోమవారం ఎక్సకవేటర్‌తో కూల్చివేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని సర్వే 825లోని భూమి తమదేనని ఇటీవల కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. ఆ నిర్మాణాలపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ జవహర్‌లాల్ ఆధ్వర్యంలో ఎక్సవేటర్‌తో పలు కట్టడాలను కూల్చివేశారు. రూరల్ సీఐ వీరబాబు భద్రత చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

తల్లీ, కూతుళ్ల అదృశ్యం



షబానా, ఈషా(ఫైల్)

హుజూర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన తల్లీ, కూతుళ్లు అదృశ్యమయ్యారు. ఎస్ఐ ముత్తయ్య సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ షబానా, ఆమె కూతురు ఈషాతో కలిసి ఈనెల 27న ఇంటి నుంచి బయటికి వెళ్లారు. రెండురోజులుగా ఇంటికి రాకపోవడంతో షబానా తండ్రి షేక్ గన్‌సైదా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిద్రిస్తున్న వాచ్‌మన్‌పై నుంచి లారీ వెళ్లడంతో మృత్యువాత

కేతేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా లారీ ఆఫీస్ పార్కింగ్ యార్డులో నిద్రిస్తున్న వాచ్‌మన్ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ఈ విషాదం నెలకొంది. మహబూబాబాద్‌కు చెందిన దిడ్డి మల్లేశం (57) తన కుమార్తెను కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామానికి చెందిన బుద్దె నవీన్‌కు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం చేశాడు. భార్యాభర్తలిద్దరూ కుమార్తెకు అందుబాటులో ఉండేందుకు చీకటిగూడెం గ్రామానికి వచ్చారు. గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న మల్లేశం స్థానిక లారీ అసోసియేషన్‌కు చెందిన పార్కింగ్ యార్డులో వాచ్‌మన్‌గా పని చేస్తుండగా, భార్య కూలీ పనులకు వెళుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పార్కింగ్ యార్డులో మంచం వేసుకుని నిద్రిస్తున్నాడు. మల్లేశం నిద్రించే విషయాన్ని గమనించకుండా డ్రైవర్ రొంపికుంట్ల శివ లారీని పార్కింగ్ చేసేందుకు వెనక్కు నడిపాడు. దీంతో లారీ మల్లేశం నిద్రిస్తున్న మంచం మీదుగా వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కేతేపల్లి ఎస్ఐ శివతేజ సంఘటనా స్థలానికి చేరుకుని మల్లేశం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు మల్లేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.



మల్లేశం మృతదేహం

భార్యను కాపురానికి పంపడం లేదని అత్తపై దాడి

నేరేడుచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పంపడం లేదని అత్తపై అల్లుడు దాడి చేశాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సోమవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన లావుడ్యా నాగేశ్వరరావుకు పాలకవీడు మండలం చెర్వుతండా గ్రామానికి చెందిన బాణోతు సునితతో సుమారు 15సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. గత ఏడాది నుంచి భార్య, భర్తల మధ్యవివాదాలు చోటు చేసుకున్నాయి. భార్య కాపురానికి రావడం లేదని పలు సార్లు అత్త బాణోతు నీల(45)తో ఘర్షణ పడ్డారు. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అప్పుడు ఇరువర్గాల మధ్య రాజీకుదుర్చుకున్నారు. అయినా భార్య కాపురానికి రాక పోవడంతో ఆగ్రహానికి గురయ్యాడు. నాగేశ్వరరావు మిర్యాలగూడలో ఉంటూ రైస్‌మిల్లులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భార్య సునీత, అత్త నీల ఇద్దరు కలిసి మిర్యాలగూడకు వచ్చిన విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు వారు ఉన్న చోటుకు వెళ్లాడు. అక్కడ నుంచి భార్య సునీత వెళ్లిపోవడంతో అత్త నీల బస్సులో నేరేడుచర్లకు చేరుకుంది. అదే బస్సులో అత్తను వెంబడించిన నాగేశ్వరావు నేరేడుచర్లలో బస్సు దిగి జాన్‌పహాడ్ రోడ్డులోకి చేరుకుంది. బంగారం దుకాణాల వద్ద నడి రోడ్డుపై అందరూ చూస్తుండగానే అతని వెంట తెచ్చుకున్న రింగ్ పానా(మెకానిక్ షెడ్‌లో వాడే రింగ్ పానా)తో ఆమె తలపై పలుసార్లు కొట్టడంతో మెదడు భాగం దెబ్బతిన్నది. అక్కడే పడిపోయిన నీలాను స్థానికులు 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పారిపోతున్న నాగేశ్వర్‌రావును స్థానికులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. గాయపడిని నీల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌కు తరలించారు. నీల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గాయపడిన నీలను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

భూబదలాయింపు కేసులో
బెయిల్ మంజూరు

హుజూర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ రెవెన్యూ గ్రామం 36.23 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతరుల పేరుతో ధరణి పోర్టల్‌లో అక్రమంగా పట్టా మార్పిడి చేసి రైతుబంధు సొమ్ము తీసుకున్న కేసులో అరెస్ట్ అయిన నాటి హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీకి బెయిల్ మంజూరైంది. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ సోమవారం బెయిల్ మంజూరు చేశారు. ఈ నెల 9న అరెస్ట్ అయిన జయశ్రీ 19 రోజుల పాటు జైలు జీవితం గడిపిన అనంతరం సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పట్టణంలోని సబ్‌జైలు నుంచి విడుదలయ్యారు. రిమాండ్ ఖైదీగా ఉన్న జయశ్రీని పోలీసు కస్టడీలోకి తీసుకుని నాలుగు రోజుల పాటు విచారించారు. కాగా రెండు సార్లు హుజూర్‌నగర్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా తిరస్కరణకు గురైంది. అదేవిధంగా హైకోర్టులో రెండుసార్లు పిటిషన్ వేయగా తిరస్కరణకు గురికావడంతో సోమవారం హుజూర్‌నగర్ కోర్టులో బెయిల్ మంజూరు కావడం గమనార్హం. దీంతో జయశ్రీకి కోర్టులో ఊరట లభించింది.

యాదగిరీశుడికి వైభవంగా లక్ష పుష్పార్చన



శివాలయంలో పూజలు జరుపుతున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఏకాదశి పూజలు సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమ రీతిలో గంటపాటు పూజ పర్వం కొనసాగింది.

హరిహరులకు విశేష పూజలు

ఆలయంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అదేవిధంగా పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,74,509 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఆలయ సిబ్బందికి మెమోలు జారీ

దేవస్థాన సిబ్బందికి ఈవో ఏ. భాస్కర్‌రావు మెమోలు జారీ చేశారు. దేవస్థాన పరిపాలన సౌలభ్యం కోసం ఈ నెల 14న జరిగిన సమావేశానికి హాజరు కావాలని శాఖాధిపతుల ద్వారా సిబ్బందికి సమాచారం పంపారు. ఈ మేరకు అధికారులు సిబ్బందికి వాట్సప్ మెసేజ్, మౌఖికంగా ఆదేశించారు. అప్పటికే కొంతమంది సెలవుల్లో ఉండగా మరికొంతమంది 13వ తేదీన రాత్రి విధులు ముగించుకొని 14న వ్యక్తిగతంగా వేర్వేరు పనుల్లో నిమగ్నమైవారు ఉన్నారు.

వివిధ కారణాలతో సమావేశానికి హాజరు కాని ఎం శ్రీను, వై. దయానంద్, బి. పాండురంగం, బి. శ్రీను, పి. బిక్షపతి, కె. లక్ష్మీనారాయణ, ఏ. కిషోర్‌ను సంజాయిషీ కోరుతూ ఈవో మెమోలు జారీ చేశారు. కాగా ఒకరోజు వేతనం నిలిపివేయాలని మెమోలు జారీ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఆర్టీయూ, యూటీఎఫ్, ఎస్టీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు బీసీ అభ్యర్థులను ప్రకటించకపోవడం తగదన్నారు. అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులనే ప్రకటించడం ఆయా సంఘాల తీరును తెలియజేస్తుందన్నారు.

పెండింగ్ డీఏను చెల్లించాలి

హాలియా, చిట్యాల, అక్టోబరు 28: పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులు, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అనుముల, పెద్దవూర, చిట్యాల మండలా నాయకులు రేపాల అశోక్, కరుణాకర్‌రెడ్డి, గుర్రం సత్యనారాయణరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, బి.గోపాల్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం వారు తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణం పూర్తయ్యేనా?

- నాలుగేళ్లుగా సాగుతున్న పనులు
- అసంపూర్తి నిర్మాణంతో కోతకు గురవుతున్న పంట పొలాలు
- వృథాగా పోతున్న పాలేరు జలాలు



చెక్ డ్యాం నిర్మాణం పూర్తి కాకపోవడంతో కిందకు పారుతున్న పాలేరు జలాలు

వేములపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాలు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి సాగు, తాగు నీటి కష్టాలను తీర్చాలన్న తలంపుతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణం నాలుగేళ్లుగా నత్తనడకగా సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. మండల పరిధిలోని సల్కునూరు, రావులపెంట గ్రా మాల మధ్య ప్రవహిస్తున్న పాలేరువాగుపై 2020 జూలైలో రూ. 2.48 కోట్లతో చెక్ డ్యాం నిర్మాణానికి కాంట్రాక్ట్ అగ్రిమెంట్ చేసుకోగా 2021లో పనులను ప్రారంభించారు. ప్రారంభ దశలో పనులు వేగంగా చేపట్టిన కాంట్రాక్టర్ ఆ తర్వాత పనుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో నేటికి నిర్మాణం అసంపూర్తిగానే ఉండిపోయింది. నాటి నుంచి పలుమార్లు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆరుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణ పనులను మాత్రం ప్రారంభించడం లేదు. ఇప్పటివరకు రూ. 187 కోట్ల మేర పనులను చేపట్టడంతో సదరు కాంట్రాక్టర్‌కు రూ.1.50 కోట్లను అధికారులు చెల్లించారు. ఇంకా రూ.67లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చేయాలని ఒత్తి డి చేస్తున్నా సదరు కాంట్రాక్టర్ తనకేమీ పట్టనట్లుగా వ్యవహస్తుండటంతో గత నాలుగేళ్లగా పాలేరు జలాలు వృథాగా కిందకు పోతున్నాయి. చెక్ డ్యాం నిర్మాణ సమయంలో ఇరువైపులా కోతకు గురికాకుండా కట్టలను బలంగా నిర్మించాల్సి ఉంది. కాగా సదరు కాంట్రాక్టర్ ఇప్పటివరకు కట్ట నిర్మాణ పనులను చేపట్టకుండా వదిలివేశారు. దీంతో వరదలు వచ్చిన ప్రతీసారి చెక్‌డ్యాం నిర్మాణ ప్రాంతంలో పక్కవైపు పంట పొలాలు కోతకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయితే పాలేరు జలాలు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేయడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరగనున్నాయి. దీంతో సాగు, తాగునీటికి వేసవికాలంలో సైతం కొరత ఉండదని సమీప గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి అసంపూర్తిగా ఉన్న పనులను చేపట్టి చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సమీప గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కోల్పోయిన పొలానికి పరిహారం అందించాలి



నాలుగేళ్లుగా చెక్‌డ్యాం నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పాలేరుకు వరదలు వచ్చిన ప్రతీసారి చెక్ డ్యాం వెంట కోతకు గురై పంట పొలాన్ని నష్టపోతున్నాం. గత సెప్టెంబరులో పాలేరుకు భారీగా వరదలు వచ్చాయి. దీంతో చెక్ డ్యాం వెంట కట్టలు బలంగా లేకపోవడంతో సుమారు ఎకరం్నర పంట పొలం పది అడుగుల మేర కోతకు గురైంది. దీంతో సుమారు రూ.45లక్షల మేర నష్టపోయాను. ప్రభుత్వం ఇరిగేషన్ శాఖ ద్వారా నష్ట పరిహారం అందచేసి ఆదుకోవాలి.

- జెర్రిపోతుల చంద్రయ్య రైతు, సల్కునూరు

పనులు చేపట్టకపోతే చర్యలు తీసుకుంటాం

చెక్ డ్యాం పనులను అసంపూర్తిగా వదిలివేయడంపై ఇప్పటికే పలుమార్లు సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. వచ్చే నెల మొదటివారం లోగా పెండింగ్ పనులను చేపట్టేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. త్వరలోనే అసంపూర్తి పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

- పాండునాయక్, ఇరిగేషన్ ఈఈ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

డిండి పునరావాసులకు న్యాయం చేస్తాం

వెంకటేశ్వరరావు, ఎస్ఈ, డిండి ఎత్తిపోతల



డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని డిండి ఎత్తిపోతల ఎస్ఈ వెంకటే శ్వరరావు తెలిపారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పునరావాస బాధితులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చేస్తానని ఆయన చెప్పారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారు?

ఎస్ఈ: 2015 జూన్ నెలలో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. భూసేకరణ, పునరావాసం ప్రక్రియ, కోర్టు కేసు కారణంగా జాప్యం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టు భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించారా?

ఎస్ఈ: ప్రాజెక్టు పరిధిలో 8 రిజర్వాయర్లను నిర్మిస్తున్నాం. భూసేకరణ ప్రక్రియ 85 శాతం పూర్తయింది. పది గ్రామాలు ముంపునకు గురవుతుండగా చింతపల్లి, మదనాపురం, ఎర్రవెల్లి, గోకారం వద్ద పునరావాసం కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టు వ్యయం ఎంత?

ఎస్ఈ: డిండి పథకాన్ని రూ.6,190 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించాం. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టుకు నీరు అందుతుంది?

ఎస్ఈ: ప్రాజెక్టు పూర్తయితే నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలోని 4.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రిజర్వాయర్లు, కాల్వ నిర్మాణ పనులు సాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి?

ఎస్ఈ: డిండి ఎత్తిపోతలలో గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చర్లగూడెం, కిష్టరాయన్‌పల్లి, చింతపల్లి, ఇర్విన్, గోకారం, ఉల్పర రిజర్వాయర్లు ఉన్నాయి.

కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, అక్టోబరు 28: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఇటీవల కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే జైవీర్‌కు మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు సోమవారం ఆయన కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు కావాల్సిన 150 డ్యూయల్ డెస్క్ బెంచీలను తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేస్తానని అన్నారు. అంతే కాక కళాశాల ప్రహరీగోడ కోసం రూ. 4.50లక్షలు నిధులు కావాలని కలెక్టర్‌కు ఫోన్ చేయగా మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వీటితో పాటు ఆర్‌వో ప్లాంట్‌కు కావాల్సిన త్రీఫేస్ విద్యుత్ సౌకర్యానికి కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లి అక్కడ మొక్కను నాటారు. అదే విధంగా కస్తూర్బా పాఠశాల సిబ్బంది వారికి ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, కలసాని చంద్రశేఖర్, ఆంజనేయులు, శ్రీనివాస్, మజార్ మొయినుద్దీన్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిల్ప, హైమావతి, ఆదిరెడ్డి, బాబుద్దీన్, వెంకన్న, పాండునాయక్, మట్టారెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



డిండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

డిండి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం డిండి మండల కేంద్రంతో పాటు చెర్కుపల్లి స్టేజీ వద్ద డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిండి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నాలతో పాటు దొడ్డు ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని ఆయన సూచించారు. జనవరి 1 నుంచి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.18వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ కానివారు 5 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. వారందరికీ దీపావళి నాటికి రుణమాఫీ అవుతుందని తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీ అందజేస్తామని తెలిపారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చెందవద్దని సూచించారు. గత ప్రభుత్వం వ్యవసాయ యోగ్యంలేని భూములు, రోడ్లు, వెంచర్లకు రైతుబంధును ఇచ్చి రూ.26వేల కోట్ల దుర్వినియోగం చేసిందన్నారు. అనంతరం 36 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి మంజూరులో రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు ఊడతాయని ఎమ్మెల్యే బాలునాయక్ హెచ్చరించారు. లబ్ధిదారులు ఎవరైనా అధికారులకు లంచం ఇవ్వాలని ప్రయత్నిస్తే చెక్కులు నిలిపివేస్తామని అన్నారు. అనంతరం డిండి మండల కేంద్రంలో వ్యవసాయశాఖ గోదాంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఎం.శ్రీనివాసరావు, టి.నాగార్జునరెడ్డి, జాల నర్సింహారెడ్డి, దొంతినేని వెంకటేశ్వరరావు, నాయిని మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, గుర్రం రాములు, నూకం వెంకటేష్, బుచ్చిరెడ్డి, గోవర్ధన్‌రావు, పోలం లక్ష్మణ్, ప్రత్యేక అధికారి సాయిబాబు, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో వెంకన్న, ఏవో రామలింగేశ్వరరావు, బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, మేకల కాశయ్య ఆనంద్‌రెడ్డి, మహమ్మద్‌అలీ, సాలయ్య, తీజ్, పోల వెంకటేష్, జగన్, పేట కొండల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు గుద్దేటి సైదులు కోరారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు రూ.4 నుంచి రూ. 6వేల వరకు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. నవంబరు 1 నుంచి 16వ తేదీ వరకు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగుల మహాసభలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీరామదాసు వెంకటచారి, కృష్ణయ్య, బాస్కర్, పార్వతి, వెంకట్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

'జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తాం'

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాతబస్తీలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ బలోపేతం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి

● మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులన్నీ మరో రెండు నెలల్లో పూర్తవుతాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మునిసిపల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ రోడ్డులో గల జూనియర్ కళాశాల సమీపంలోని రైతుబజారులో సెట్విన్ అనే సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 150 రకాల కోర్సులపై శిక్షణ ఇస్తారని, దీంతో ఎంతోమంది యువతకు ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలు, మంచినీటి కుళాయి పన్నులను వసూళ్లు చేసే మునిసిపల్ సిబ్బందికి కౌన్సిలర్లు సహకరించాలని సూచించారు. అభివృద్ధి పనులపై ఆయా కాంట్రాక్టర్లను తొందరపెడితే నాణ్యత లోపించే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ మునిసిపల్ నిధులతో ఏర్పాటు చేసిన జిమ్‌ల ను పాడైనందున మరమ్మతులు చేయించాలని కోరారు. అదేవిధంగా ఎన్జీ కళాశాలలో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని, ఎల్ఆర్ఎస్, మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వివిధ కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల అభివృద్ధి కోసం రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, ఈఈ రాములు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌గా సుదర్శన్



సుదర్శన్

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌గా వైసుదర్శన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన భాస్కర్‌రెడ్డి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నాగారం మునిసిపాలిటీకి బదిలీపై వెళ్లారు. మేడ్చల్‌లో పనిచేస్తున్న సుదర్శన్ దేవరకొండకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని సమస్యలను అందరి సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు.

దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు బదిలీ

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. దేవరకొండ ఆర్డీవోగా హైదరాబాద్‌లో ఆర్డీవోగా పనిచేస్తున్న రమణారెడ్డి దేవరకొండకు బదిలీ అయ్యారు. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. శ్రీరాములు దేవరకొండ ఆర్డీవోగా రెండు సంవత్సరాలు పనిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

దామరచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో టీజీటీ సైన్స్ లేదా ఫిజిక్స్ సైన్స్‌లో పార్ట్‌టైంగా ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రం 4 గంటలలోపు దామరచర్ల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో అర్హత ధ్రువీకరణ పత్రాల జీరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సామాన్య ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా! నా క్లయింటు బాసూరి గోవర్ధన్ S/o చంద్రయ్య, నివాసం: నల్లగొండ గారు శ్రీ వీర్లపాటి యాదయ్య, తండ్రి కొండయ్య మరియు వీర్లపాటి శోభ, భర్త యాదయ్య ఇద్దరి నివాసము నల్లగొండ గార్లతో తేది 30-03-2024 రోజున ఇంటి నెం. 6-6-215, వార్డు నెం. 6, బ్లాకు నెం. 4, 355 చదరపు గజములు గల 3000 చదరపు ఫీట్ల ఆర్‌సిసి కప్పుతో రెండు అంతస్తుల గృహము రవీంద్రనగర్, నల్లగొండ పట్టణంలో గల దానిని విక్రయ ఒప్పందము పొంది పెద్దమొత్తంలో విక్రయధనము చెల్లించి ఉన్నారు. మరియు శ్రీమతి వీర్లపాటి శోభ గారి పేరున ఉన్న గృహమును రిజిస్ట్రీ చేయించుటకు ఉన్నారు. కాని శ్రీ వీర్లపాటి యాదయ్య గారి పేరున వెనుక భాగములో గల ఇల్లు బ్యాంకు తాకట్టులో కలదు. మిగిలిన చెల్లించవలసిన డబ్బులు అదే బ్యాంకులో డిపాజిట్ చేయునైనది. అయినప్పటికి వీర్లపాటి యాదయ్య గారు రిజిస్ట్రీ చేయకుండా కాలము జరుపుచున్నారు. అందువల్ల నా క్లయింటుకు తెలియవచ్చినది ఏమిటంటే పైకమునకు ధ్రాయించి ఇచ్చిన ఒప్పందము తేది. 30-03-2024ను ఉల్లంఘించి, ఇతరులకు అమ్ముటకు ప్రయత్నించుచున్నట్లు తెలిసినది. కావున సామాన్య ప్రజలకు తెలియచేయునది ఏమనగా పై గృహమును వీర్లపాటి యాదయ్య గారి నుండి ఎవ్వరు విక్రయ ఒప్పందములు గాని రిజిస్ట్రీలు గాని చేసుకొనరాదు. ఇట్టి తీరుకు మీరు జరుగు కష్టనష్టములకు మీరే బాధ్యత వహించవలెయును. నా క్లయింటుకు ఎలాంటి బాధ్యత ఉండదు మరియు అతను తీసుకొనబోవు చట్టబద్ధమైన చర్యలకు బాధ్యులగుదురు. కావున ఈ ప్రకటన ద్వారా తెలియపర్చనైనది.

ఇట్లు: సం/- పూట్యారి సురేందర్‌రెడ్డి
న్యాయవాది, నల్లగొండ.

నల్లగొండ పార్లమెంటు టీడీపీ అడ్‌హక్

కమిటీ కన్వీనర్‌గా కసిరెడ్డి శేఖర్‌రెడ్డి



కసిరెడ్డి శేఖర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా ఆ పార్టీ నాయకుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డిని నియమిస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో 2024-26 సంవత్సరానికి సంబంధించి టీడీపీ సభ్యత్వ నమోదు ఈ అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌ను నియమించినట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదును చేపట్టడానికి అడహక్ కమిటీ కన్వీనర్లు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనను నియమించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పొలిట్‌బ్యూర్ సభ్యుడు బక్కని నర్సింహులు, ఇతర రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి పార్టీ శ్రేణులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నార్కట్‌పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఉన్న ఓ ఇంట్లో పట్ట పగలే చోరీ జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎం.ఎడవల్లి గ్రామానికి చెందిన కొప్పు జానయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి వద్ద వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి వద్దకు వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగులగొట్టి వస్తువులను చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచిన నాలుగు తులాల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, క్లూస్ టీం బృందం సభ్యులు పరిశీలించారు. బాధితుడు కొప్పు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిడమనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నిడమనూరు మండలం వేంపాడ్ శివారులో సాయిబాబా విగ్రహం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం మునగబావిగూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన మొగులయ్య, నాశనబోయిన బొర్రయ్య హాలియాలో కూలీ పనులు ముగించుకొని బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తున్నారు. నిడమనూరు మండలం వేంపాడ్ శివారులో సాయిబాబా విగ్రహం సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.



ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

అందులో ఆయిల్‌పామ్ తోటను 50 ఎకరాల్లో ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడానికి, శిక్షణ తరగతులు నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఒక్కో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలుంటాయి. ఆయిల్‌పామ్ కంపెనీని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ-సూర్యాపేట జిల్లాల మధ్యలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటు కావాలంటే కనీసం 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు విస్తరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దిగుబడులు ఖమ్మం జిల్లాతో పాటు విజయవాడ ప్రాంతానికి ఆయా కంపెనీలు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం తోటలు వేస్తున్న రైతులు మార్కెటింగ్ సమస్యపై అయోమయానికి గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం భరోసా ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడంతోపాటు పంటలు వేసిన రైతులు ఎట్టి పరిస్థితులల్లోనూ నష్టపోయేది లేదని స్పష్టత ఇస్తుంది. ఈ తోటల సాగు సులభం కావడంతో పాటు ఆయిల్‌పామ్ తోటలు పండించిన రైతులతో కంపెనీలు ఒప్పందం చేసుకుంటున్నాయి. ధరలు సైతం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ధర నిర్ణయిస్తుండటంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆయిల్‌పామ్‌కు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో కంటే అధికంగా నల్లగొండ జిల్లాలోనే ఆయిల్‌పామ్ విస్తరించింది. నల్లగొండ జిల్లాలో నీటి వనరులు అధికంగా ఉండటంతో తోటలు విస్తరించాలని యోచిస్తున్నారు. అదేవిధంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పతంజలి కంపెనీ మొక్కలను పంపిణీ చేస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆయిల్‌ఫెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నర్సరీల నుంచి మొక్కలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాలో సాగు పెంచేలా కృషి



ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాలమేరకు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ఉద్యానశాఖతో కలిసి ముందుకు సాగడంతో పాటు సాగు పెంచడానికి సహకారం అందిస్తారు. ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో ఆయిల్‌పామ్ సాగు తోటలకు సంబంధించి ఏఈవోలకు ఒక్కొక్కరికి 150 ఎకరాల వరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే జిల్లాలో ఏఈవోలు రైతులతో సమావేశమవుతూ ఆయిల్‌పామ్ సాగు గురించి వివరిస్తున్నారు. ఏఈవోలతో పాటు ఏడీఏలు, ఏవోల సహకారం కూడా తీసుకుంటారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై ఉంటారు. దీంతో ఆయిల్‌పామ్ సాగును పెంచడం కోసం వ్యవసాయశాఖ కృషి చేస్తుంది.

● పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ

తోటల విస్తరణకు అనుగుణంగా ఫ్యాక్టరీ ఏర్పాటు



25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగయితే జిల్లాలో ప్రత్యేకంగా ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది. ఇప్పటికి 10వేల ఎకరాల్లో సాగైంది. మరో 15వేల ఎకరాల్లో తోటలను విస్తరింప జేసేందుకు కలెక్టర్ సూచన, సహకారంతో వ్యవసాయశాఖతో కలిసి తోటలు విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యానశాఖలో హెచ్‌వోలు కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు ఆయిల్‌పామ్ సాగుకు సహకరించడానికి ప్రణాళిక బద్ధంగా రెండు శాఖలు కలిసి ముందుకు సాగుతున్నాయి. త్వరలోనే లక్ష్యానికి అనుగుణంగా పంటల సాగు పూర్తి కానుంది.

- సాయిబాబా, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నల్లగొండ

సునీల్‌కు పటేల్ జాతీయ స్థాయి స్ఫూర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న బోడ సునీల్ మాదిగ

శాలిగౌరారం, మిర్యాలగూడటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడపల్లి కళానాట్య వేదిక త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బోడ సునీల్ మాదిగకు అవార్డును అందజేశారు.

● మిర్యాలగూడ పట్టణానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు అవిరెండ్ల సందీప్‌కుమార్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు.